
ప్రజాశక్తి
మంగళవారం 10 డిసెంబర్ 2024
5
విజయనగరం



గురుకులాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి 12న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల / కళాశాలల్లో ఖాళీ గా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి పార్ట్‌టైం ప్రాతిపదికన అర్హతగల అభ్యర్థులకు ఈనెల 12న నెల్లిమర్ల బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో డెమో కమ్ వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు గురుకుల సాంఘిక సంక్షేమ శాఖ సమన్వయకర్త టిఎం ఫ్లోరెన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులకు వేపాడ, వియ్యంపేట, నెల్లిమర్లలో గణిత సబ్జెక్టు, భామినిలో ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టులకు, నెల్లిమర్ల లో సివిక్స్ సబ్జెక్టుకు. పురుష అభ్యర్థులకు కొప్పర్ల లలో బోటనీ పోస్ట్ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ (55శాతం తక్కువ కాకుండా), సంబంధిత సబ్జెక్టు ఒక మెథడాలజీతో బిఎడ్, టెట్ పేపర్-2 అర్హతగా కలిగి ఉండాలని తెలిపారు.. కనుక ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికేట్స్ తో హాజరు కావాలని తెలిపారు.




ఎఫ్‌పిపిసిఎ పేరిట అధనపు బాదుడు

యూనిట్లతో సంబంధం లేకుండానే 'ట్రూఅప్' భారం

లబోదిబోమంటున్న విద్యుత్తు వినియోగదారులు

'వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత 8 సార్లు విద్యుత్తు ఛార్జీలను పెంచి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను దోచుకుంది. మేము అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలను పెంచే ప్రసక్తే లేదు'.

- ఎన్నికలకు ముందు విజయనగరంలో జరిగిన సభలో చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలివి. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతనలేదనే విషయం తాజాగా పెంచిన విద్యుత్తు ఛార్జీలతో తేటతెల్లమవుతోంది. తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన ఆరు నెలలకే ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీల పేరిట విద్యుత్తు ఛార్జీలను పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పెను భారం వేశారు. గతంతో పోలిస్తే ప్రతిఒక్కరికీ రూ.50 నుంచి 500, 1000 వరకూ అదనంగా ఛార్జీలు పెరగడంతో కరెంటు బిల్లులు కట్టేందుకు పేదలు లబోదిబోమంటున్నారు.



అక్టోబర్, నవంబర్ నెలల బిల్లుల్లో ఎఫ్‌పిపిసిఎ పేరిట అదనపు ఛార్జీల తేడా

ప్రజాశక్తి- విజయనగరం డెస్క్

వాస్తవానికి 2021 నుంచి 2023 వరకూ వాడిన కరెంటు ఛార్జీలకు సర్దుబాటు పేరిట ఇప్పుడు ట్రూఅప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ పేరిట ప్రస్తుత బిల్లులతో కలిపి వసూలు చేస్తున్నారు. రెండేళ్ల వరకు ఈ లెక్కన జిల్లా ప్రజలపై సుమారు రూ.3వందల కోట్లు భారం పడనుంది. వినియోగదారుల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు డిసెంబర్ నుంచి అదనపు బాదుడుకు శ్రీకారం చుట్టింది. శీతాకాలం కావడంతో యూనిట్ల వినియోగం తగ్గినందున బిల్లు డబ్బులు తక్కువ రావాల్సి ఉంది. కానీ ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్) పేరిట వినియోగదారులకు అర్థంకాని రీతాలో భారం వేశారు. గతంలో వినియోగించిన యూనిట్లకు వీటి పేరిట వేసిన భారం అత్యధికంగా వెయ్యి రూపాయలు వరకు ఉండడంతో వినియోగదారులు లబోదిబోమంటు న్నారు. ఇందులో చాలా మంది గతంలో తాము వాడిన విద్యుత్తుకు ఇప్పుడు ఛార్జీలు వసూలు చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఒకేసారి అప్పటి భారం ఇప్పుడు వేయడంతో చాలా మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అద్దెలకు ఉన్న వారు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా అద్దెకు వచ్చిన వారు గతంలో ఆ ఇంట్లో అద్దెకు ఉన్న వారు వాడిన కరెంటుకు ఇప్పుడు వీరు ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. గతంలో వాడిన వారు తక్కువ యూనిట్లు వాడితే కొంత పర్వాలేదు గానీ వారు ఎక్కువ యూనిట్లు కరెంటు వాడి ఉంటే అప్పటి భారం ఇప్పుడున్న వారిపై పడి ఇబ్బంది పడుతున్నారు.

రూ.97 అదనంగా వచ్చింది



నేను షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గత నెలతో పోల్చితే అదనంగా 97 రూపాయలు ట్రూ అప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ పేరిట వచ్చింది. ఒకేసారి ఇంత మొత్తంలో కరెంటు బిల్లులు పెరిగితే షాపు మీద వచ్చిన లాభమంతా అటే పోతుంది. ప్రభుత్వం పునరాలోచన చేసి ఛార్జీలను తగ్గించాలి.

- గందం రమణమ్మ, సాయినగర్ కాలనీ, తోటపాలెం

ఒకేసారి పెంచడం ఇబ్బందే..



గతంలో వాడిన కరెంటుకు ఇప్పుడు ట్రూఆఫ్ ఛార్జీల పేరిట ఒకేసారి డబ్బులు వసూలు చేయడం ఇబ్బందే. గతంలో మేమే వాడినా ఇప్పుడు గతంలో వాడిన వాటికి డబ్బులు వసూలు చేయడం బాగోలేదు. నాకు గత నెలతో పోల్చితే అదనంగా రూ.102 వచ్చింది. నెలకు రూ.500 నుంచి 800 వరకూ కరెంటు బిల్లు వస్తుంది. ఇలా అయితే ఆర్థిక ఇబ్బందులు తప్పవు.

– కె. రమేష్, తోటపాలెం

ఎందుకు పెరిగిందో తెలియదు



నేను ఇంట్లో ఒక లైటు మాత్రమే వినియోగిస్తాను. నాకు రూ.275 బిల్లు వచ్చింది. పైగా ఇందులో ఈ నెల ట్రూ అప్ ఛార్జీల పేరిట అదనంగా రూ.60 వేశారు. అవి ఏ ఛార్జీలో కూడా నాకు తెలియదు. ప్రభుత్వం ప్రజలపై భారం లేకుండా చేయాలి.

- లెంక కృష్ణమ్మ, సాయినగర్, తోటపాలెం

మద్యం సేవించి కొడుతున్నారు

- బిసి బాలికల వసతిగృహ వార్డెన్‌పై విద్యార్థినుల ఫిర్యాదు
- ఆమె భర్త అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆవేదన
- వార్డెన్‌ను విధులను తొలగింపు



విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తవలస

బిసి బాలికల వసతిగృహ వార్డెన్ నిత్యం మద్యం సేవించి తమను కొడుతున్నారని విద్యార్థినులు... కొత్తవలస పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వార్డెన్ భర్త తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సంఘటన మండలంలో సంచలనం సృష్టించింది.

విజయనగరం జిల్లా కొత్తవలస మండల కేంద్రంలోని బిసి బాలికల వసతిగృహ విద్యార్థినులు.. వార్డెన్ నీరజకుమారిపై, ఆమె భర్తపై సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ షణ్ముఖరావుకు, తహశీల్దార్ కార్యాలయంలో సిఎస్ డిటి రామకృష్ణకు ఫిర్యాదుచేశారు. వార్డెన్ నీరజకుమారి రోజూ మద్యం మత్తులో తమపై దాడి చేస్తున్నారని, అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నారని వారు వాపోయారు. ఆమె భర్త విద్యార్థినుల పట్ల అసభ్యకర చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వసతిగృహంలో సరిగా ఆహారం పెట్టడం లేదని, రేషన్‌ను తరచూ అమ్ముకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే స్పందించి వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని, ఆమె భర్తను అరెస్టు చేయాలని కోరారు. కొత్తవలస పోలీస్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న హాస్టల్ భవనానికి బాలికల వసతిగృహాన్ని మార్చి, తమకు రక్షణ కల్పించాలని కోరారు. సిఐ షణ్ముఖరావు, తహశీల్దార్ నీలకంఠరావు..వసతిగృహాన్ని సందర్శించారు. వార్డెన్‌ను విధుల నుంచి తొలగించినట్లు కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని తహశీల్దార్ తెలిపారు. ఎస్‌సి బాలికల వసతిగృహ వార్డెన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

వార్డెన్‌పై విచారణ : ఎమ్మెల్యే

కొత్తవలస బాలికల హాస్టల్ వార్డెన్ నీరజ కుమారిపై విచారణ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. వార్డెన్‌పై విద్యార్థినుల ఫిర్యాదు నేపథ్యంలో ఎమ్మెల్యే.. బాలికల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వార్డెన్ నీరజ కుమారి నుంచి వివరణ కోసం కొన్ని ప్రశ్నలు అడగ్గా, ఆమె సరైన సమాధానం చెప్పకపోవడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వసతిగృహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

వార్డెన్ నీరజకుమారిని తొలగించాలని డిమాండ్‌చేస్తూ బాలికల వసతిగృహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థినులు సుమారు మూడు గంటలపాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ వార్డెన్‌ను సస్పెండ్ చేసేంతవరకూ కదిలేది లేదని స్పష్టంచేశారు. దీంతో వార్డెన్‌ను సస్పెండ్ చేస్తూ డిబిసిడబ్ల్యుఒ ఉత్తర్వులు ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, సహాయకార్యదర్శి రమేష్, గర్ల్ కోకన్వీనర్ భారతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలపై కేసులు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సమస్యల పరిష్కారానికి ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలపైనా, సిఐటియు నాయకులపైనా ఏడేళ్ల క్రితం పోలీసులు పెట్టిన కేసులను కోర్టులు సోమవారం కొట్టివేశాయి. 2017లో కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు తమ సమస్యలపై ధర్నా చేశారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు 32 మందిపై కేసు నమోదు చేశారు. ఏడేళ్ల విచారణ అనంతరం పోలీసులు చేసిన ఆరోపణలు రుజువు కాకపోవడంతో మొబైల్ కోర్టు న్యాయమూర్తి ఈ కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. 2016లో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసిన 26 మంది ఆశా కార్యకర్తలపైనా, నాయకులపైనా వన్‌టౌన్ పోలీసులు కేసు పెట్టారు. ఆరోపణలు రోజువు కాకపోవడంతో ఈ కేసును కూడా న్యాయమూర్తి కొట్టివేశారు.

మహాసభకు సర్వం సిద్ధం

- నేడు, రేపు సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభ
- ఎర్ర జెండాలు, తోరణాలతో కురుపాం ముస్తాబు
- రావాడ జంక్షన్‌లో బహిరంగ సభ
- హాజరు కానున్న జాతీయ, రాష్ట్ర నేతలు పుణ్యవతి, తులసీదాస్, సుబ్బరావమ్మ



ప్రతినిధుల సభ వేదిక వద్ద ఏర్పాటుచేస్తున్న తోరణాలు

ప్రజాశక్తి - కురుపాం

సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా 10వ మహాసభలు కురుపాంలో నేటి నుంచి రెండు రోజులు పాటు జరుగమన్నాయి. మహాసభలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాసభల నేపథ్యంలో కురుపాం ముస్తాబైంది. ముఖ్య కూడళ్లు, పాత ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఎర్రజెండాల తోరణాలతో ముస్తాబు చేశారు. ప్రతినిధుల సభ జరగనున్న అలకానంద కల్యాణ మండపం ప్రాంతానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిని గుర్తు చేసుకుంటూ కీ.శే సీతారాం ఏచూరి నగర్‌గా నామకరణం చేశారు. సభా ప్రాంగాణానికి బుద్ధదేవ్ భట్టాచార్య పేరు, వేదికకు రుద్రరాజు సత్యనారాయణ రాజు పేర్లు పెట్టారు. బహిరంగ సభ వేదికను, ప్రతినిధుల సభ జరిగే వేదికను ఎర్రజెండాలు, తోరణాలతో అందంగా అలంకరించారు. మహాసభల మొదటి రోజు మంగళవారం ఉదయం 11 గంటలకు కురుపాం పాత బస్టాండ్ నుంచి ప్రధాన రహదారి మీదుగా రావాడ రోడ్డు జంక్షన్ వరకు భారీ ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభకు ఏర్పాటు చేశారు. సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి. తులసీదాస్, కె.సుబ్బారావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి హాజరై సభలో ప్రసంగించనున్నారు. ర్యాలీ, బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు. మహాసభలను పండగ వాతావరణం నిర్వహించుకునేందుకు పార్టీ కేడర్ సమాత్తమైంది. మహాసభల గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన పోరాటాలు, అనుభవాలు, ఇంకా పేదలు, రైతులు, దళితులు, గిరిజనులు వంటి అనగారిన తరగతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించనున్నారు. వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన పోరాటాలపై కార్యాచరణ రూపొందించనున్నారు. పలు సమస్యల పరిష్కారానికి తీర్మానాలను సభ ఆమోదానికి పెట్టనున్నారు.

పింఛన్ల ఏరివేతకు తనిఖీలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ



విచారణ చేస్తున్న డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, అధికారులు

సామాజిక పింఛన్ల తనిఖీకి రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని వెల్దూరు పంచాయతీ, మన్యం జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేట పంచాయతీల్లో పింఛన్ల తనిఖీని అధికారులు సోమవారం చేపట్టారు. వెల్దూరులో డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో అధికారులు పింఛన్లను పరిశీలించారు. వెల్దూరు సచివాలయం పరిధిలో వెల్దూరు, నడిపల్లి పంచాయతీలలో ఉన్న 437పింఛన్లను అధికారులు పరిశీలించనున్నారు.

11 బృందాల ద్వారా పరిశీలన

వెల్దూరు సచివాలయం పరిధిలో ఉన్న 437 పింఛన్‌లను పరిశీలన చేయడానికి 11 టీములును ఏర్పాటు చేశారు. ఆ టీముల్లో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌తో పాటు వెలుగు ఎపిఎం ఉన్నారు. ఒక్కో టీమ్ 40 పింఛన్లు పరిశీలన చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇంటింటికి వెళ్లి మొబైల్‌లో 6 అంచెల పద్ధతిలో పరిశీలన చేస్తున్నారు. స్థానికంగా నివాసముంటున్నారా, విద్యుత్ ఎంత వాడుతున్నారు. నాలుగు చక్రల వాహనం ఉందా, భూము ఎంత ఉంది, మీ ఆదాయం ఎంత, మీ కుటుంబంలో ఎవరైనా ఉద్యోగం చేస్తున్నారా, ప్రభుత్వం నుంచి ఫించన్‌దార్లు ఎవరైనా ఉన్నారా అంటూ ప్రశ్నిస్తూ పరిశీలన చేశారు. వితంతువైతే భర్త డెత్ సర్టిఫికెట్, వృద్ధాప్యమైతే వయసు నిరార్ధరణ సర్టిఫికెట్, ఒంటరి మహిళా, వికలాంగులైతే సదరం సర్టిఫికెట్లు చూపించమంటూ మొబైల్ ఆప్షన్‌ల్లో నింపుతున్నారు.

రేపటికి పూర్తి

జిల్లాలో వెల్దూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్నామని డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. సచివాలయ పరిధిలో ఉన్న 437 పింఛన్లను 11 టీమ్‌లు ద్వారా రెండు రోజులు పాటు సర్వే చేస్తున్నామన్నారు. వీరిలో ఎంత మంది అనర్హులు అన్నది ప్రస్తుతం తెలీదన్నారు. పింఛన్‌దార్ల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. పరిశీలన బృందంలో పీడీతో పాటు పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల ఎంపిడిఒలు రాధిక, భవాణి, కామేశ్వరావు, రామకృష్ణరాజు ఉన్నారు.

ఆయాను విధుల్లోకి తీసుకోవాలి

కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం ప్రాజెక్టు పరిధి రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయా మానాపురం సౌజన్యను అక్రమం తొలగించారని, వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ వర్కర్స్అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్‌వాడీలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ప్రారంభించారు. రామన్నపేట గ్రామంలో అంగన్వాడీ హెల్పర్ గా 2022 సంవత్సరం అక్టోబర్‌లో ఎం.సౌజన్యను నియమించారని తెలిపారవు. అప్పటి నుంచి ఎటువంటి రిమార్కు లేకుండా పనిచేస్తున్న ఆమెను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రామన్నపేట గ్రామ సర్పంచ్ చేసిన రాజకీయ వేధింపులో భాగంగా సౌజన్యని తొలగించాలని ఐసిడిఎస్ పిఒపై ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి అంగన్వాడీ యూనియన్ తీసుకెళ్లిందని, అయినా తప్పుడు సర్టిఫికెట్లు పెట్టిందని ఆరోపించి గతనెల 30న తొలగించారని వివరించారు. అప్పుడు సౌజన్య సర్టిఫికెట్లు సక్రమమైనప్పుడు నేడు అక్రమం ఎలా అవుతాయని ప్రశ్నించారు. రాజకీయ వేధింపుల్లో భాగంగానే తొలగించారని, మంత్రి స్పందించి వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో అంగన్వాడీ హెల్పర్, మానాపురం సౌజన్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా అధ్యక్షులు బి. పైడిరాజు, జిల్లా కమిటీ సభ్యులు పి కుమారి, హైమా, ఎ.రోజా, శ్యామల, కె.తులసి, ఆర్ శంకరావతి పాల్గొన్నారు.



దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

కనీస వేతనం ఇవ్వాలని గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, బకాయి జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ అండ్ గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రామపంచాయితీలను పరిశుభ్రంగా తీర్చిద్దిడంలో తమ ఆరోగ్యాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్న పంచాయతీకార్మికులు, గ్రీన్‌అంబాసిడర్స్ బకాయిజీతాలు సకాలంలో రాకపోవడం వలన తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. గ్లౌజు, యూనిఫాం, సబ్బులు, ఆయిల్ వంటి రక్షణ పరికరాలు లేక అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. వీటితో పాటు బకాయిలో ఉన్న 4-18 నెలలు జీతం చెల్లించాలని, ప్రమాదభీమా వర్తింపజేయాలని, మట్టిఖర్చులకు రూ. 15,000/-లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రిక్షాలకు రిపేర్లు ప్రభుత్వమే చేయించాలనీ డిమాండ్ చేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.శ్రీను, నూకరాజు, భవాణి,ఈశ్వరరావు కార్మికులు పాల్గొన్నారు.

48 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ

- రైతుకు అన్నివిధాలా అండగా నిలబడతాం
- పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-డెంకాడ

రైతుకు అన్ని విధాలా అండగా నిలబడతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ అన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. డెంకాడ మండలం చందకపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ధాన్యం దిగుబడి, కొనుగోలు ప్రక్రియ, రవాణా, నగదు జమ, ఇతర సమస్యలపై ఆరా తీశారు. రైతులతో మాట్లాడించి వారి సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ రైతులనుద్దేశించి మాట్లాడుతూ, గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, సుమారు రూ.1674 కోట్ల ధాన్యం డబ్బులు బకాయి పెట్టిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆ బకాయిలన్నిటినీ పూర్తిగా చెల్లించిందని చెప్పారు. గతంలోలా కాకుండా రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం తరలించవచ్చునని సూచించారు. తేమ 17 శాతం వరకు అనుమతి ఉందని, 5 కిలోలు అదనంగా తీసుకొని, తేమ 24 శాతం వరకు ఉన్నప్పటికీ కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో కేవలం 9,100 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగ్గా, ఈ ఏడాది 78వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశామని మంత్రి చెప్పారు. 24 గంటల్లోనే సుమారు 16వేల మంది రైతులకు రూ.174 కోట్లు చెల్లించామని తెలిపారు. గత ప్రభుత్వం రైతులకు ఎటువంటి సాయమూ చేయలేదని, ట్రాక్టర్లు, డ్రయ్యర్లు, కనీసం టార్పాలిన్లు సైతం ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 32 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని ఈ ఏడాది లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 13,24,000 టన్నులను సేకరించామన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా, ఎఐ టెక్నాలజీతో ట్రక్‌షీట్లను రూపొందిస్తున్నామని తెలిపారు. పంట దిగుబడి పెంచేందుకు వ్యవసాయాధికారులు రైతులకు సలహాలను అందించాలని మంత్రి కోరారు. నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగ మాధవి మాట్లాడుతూ, తమ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు లేక, బోర్లు పైనే వ్యవసాయం సాగుతోందని, ఏడాదికి ఒక పంట మాత్రమే పండిస్తున్నారని చెప్పారు. సాగునీటి సదుపాయం కల్పించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించవద్దని, కొనుగోలు కేంద్రాలకు మాత్రమే ధాన్యం తరలించాలని జెసి కోరారు కార్యక్రమంలో ఎపి మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, డిఎస్ఒ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనా కుమారి, నాలుగు మండలాల తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీఎంపిపి కంది చంద్రశేఖర్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, టిడిపి పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రెటరీ పాణిరాజు, మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, జనసేన మండల కోఆర్డినేటర్ పైలా శంకర్, నియోజకవర్గ జనసేన నాయకుడు దిండి రామారావు, జనసేన నాయకులు చింతపల్లి రామ్మూర్తి, కిరణ్ , తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అండగా న్యాయస్థానం

ప్రజాశక్తి–బొబ్బిలి

విద్యుత్ వినియోగదారులకు అండగా ఉంటామని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించి, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఉభయగోదావరి జిల్లాల్లో మూడు ఆర్థిక సంవత్సరాల్లో 96 కేసుల్లో రూ.14,26,650 నష్టపరిహారం ఇప్పించినట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులకు న్యాయమైన సేవలు అందించాలని కోరారు. విద్యుత్ సమస్యలపై కోర్టు సంప్రదించావచ్చని కోరారు. కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు షేక్ బాబర్, సాంకేతిక సభ్యులు ఎస్.మసిలామణి, అధికారులు పాల్గొన్నారు.

సైనిక దళాలకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి–విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్మీ పతాక దినోత్సవ సందర్భంగా ఎన్‌సిసి కేడెట్లు విరాళాలు సేకరించారు. కళాశాల యాజమాన్యం, వివిధ విభాగాధిపతులు, స్టాఫ్, స్టూడెంట్స్ సహాయానికి తమ వంతు విరాళాన్ని అందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ దేశరక్షణకు కృషి చేసిన సైనిక దళాలకు విరాళాలు సేకరించటం నేటి యువత బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి రామమూర్తి, సత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సాయిదేవమని, ఎన్‌సిసి ఆఫీసర్స్ కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ వరలక్ష్మి, ప్రశాంత్, కె సత్యనారాయణ పాల్గొన్నారు

అవినీతి రహిత పాలన అందించాలి

బొబ్బిలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి రహిత పాలన అందించాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ డిమాండ్ చేశారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవినీతిని నివారించాల్సిన పాలకులు.. ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోరాటం చేయాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి–విజయనగరంకోట

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షులు కావలి గ్రీష్మ అన్నారు. సోమవారం మహిళా ప్రాంగణాన్ని సందర్శించారు. ప్రాంగణం లో శిక్షణ పొందిన మహిళలతో మాట్లాడుతూ ఏయే విభాగాల్లో శిక్షణ పొందారని అడిగితెలుసుకున్నారు. శిక్షణ అనంతరం మహిళలు తయారుచేసిన మగ్గం డిజైన్స్ చూసి సంతృప్తి చెందారు. శిక్షణ పూర్తిచేసిన మహిళలకు తదుపరి ఉన్నత శిక్షణ కోసం ప్రతిపాదనలు చేస్తానని తెలిపారు. అనంతరం బ్యూటీషియన్, మగ్గం వర్క్ మరియు టైలరింగ్ లో శిక్షణ పొందిన 90 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సహకార సంస్థ మేనేజర్ పి.విమల, పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ఇకపై రోడ్లు లేని గ్రామాలుండవు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి–శృంగవరపుకోట

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఇకపై రోడ్లు లేని గ్రామాలు ఉండవని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శృంగవరపుకోట పట్టణంలో కలింగెడ్డ, పందిరప్పన్న జంక్షన్ వద్ద సోమవారం రూ.15 లక్షలతో సిసి రోడ్లు, డ్రెయిన్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికులతో ఎమ్మెల్యే మమేకమై, వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, డ్రెయిన్లు, తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, నాయకులు భీశెట్టి అరుణ, కాపుగంటి వాసు, కిరణ్, సాయిరాం పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బొబ్బిలి: ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులు ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.శ్రీనివాస్, ఆర్.రామారావు, రమానందం, శ్రీరామ్, ఈశ్వరరావు, రాము పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయం

కొత్తవలస: హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయమని ఎపి ప్రభుత్వ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శులు పద్మావతి, సత్యారావు అన్నారు. సోమవారం కొత్తవలసలో ఏర్పాటుచేసిన యూనియన్ సమావేశంలో వారు మాట్లాడారు. కోర్టు తీర్పును అడ్డంపెట్టుకుని, ప్రభుత్వం అనాలోచితంగా తొలగించడం బాధాకరమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిహెచ్.ఈశ్వరరావు, వి.నరసింహరావు, ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి–విజయనగరం కోట

ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలు సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీని ఎంతో శక్తి సామర్థ్యాలతో నడిపిస్తున్నారని కొనియాడారు. ఆమె నాయకత్వంలో పార్టీ ఇంకా అభివద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మైనార్టీ నాయకులు షరీఫ్, శనపతినేటి శ్రీనివాస్, చంద్రశేఖర్ ,కరీం, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రేవతి

కొత్తవలస: దెందేరు పాఠ శాల విద్యార్థిని గొర్లె రేవతి జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహించనుంది. రేవతిని డిఎస్‌డిఒ వెంకటే శ్వరరావు, డిఇఒ మాణిక్యంనాయుడు, డిప్యూటీ డిప్యూటీ వెంకటరమణ, వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టివి భగవాన్‌దాస్, హెచ్‌ఎం సునీత, పీడీ క్రిష్ణరాజు అభినందించారు.

అదానీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

విజయనగరంకోట: అదానీ అక్రమాలపై విచారణ చేయాలంటూ సిపిఐ ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ అదానీ అక్రమాలపై ఆధారాలు ఉన్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు విచారణ చేయడం లేదని ప్రశ్నించారు. మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరపాలని, సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం, ఉపసంహ రించాలని అధిక ధరలను అరికట్టాలని, నిరుద్యోగం నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, పాల్గొన్నారు.

బొబ్బిలి : అదానీ అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని సిపిఐ ఆధ్వర్యాన సోమవారం పట్టణంలోని జెండామహాల్ సెంటర్ వద్ద ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, వై.బాబ్జి, కె.సత్యనారాయణ రాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు నాలుగు అవకాశాలు

చీపురుపల్లి: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ ఓటుని నమోదు చేసుకోవడానికి ఏడాదికి నాలుగు పర్యాయాలు అవకాశం ఉంటుందని ఓటరు నమోదు అధికారి జివి సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు ఏటా జనవరి1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1వ తేదీలలో ఓటు నమోదుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని చెప్పారు. ఓటు నమోదుకు సంబంధించి దరఖాస్తులు ఓటరు నమోదు అధికారి, ఓటరు నమోదు సహాయాధికారి, బూత్ లెవెల్ స్థాయి అధికారి వద్ద అందుబాటులో ఉంటాయని అన్నారు. www.ceoandhra.nic.in వెబ్ సైట్‌లో కూడా లభిస్తాయన్నారు. ఓటు నమోదు కోసం http://voters.eci.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ చేసుకోవచ్చునన్నారు. కలిగి విదేశాలలో నివసిస్తున్న వారు ఫారం–6ఏ ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి – నెల్లిమర్ల

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆర్‌డిఒ దాట్ల కీర్తి అన్నారు. సోమవారం కొండ వెలగాడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రీసర్వే లోపాలు, పేర్లు తప్పులు అడంగల్, 1బి వంటి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.సుదర్శన రావు, డిటి రవి శంకర్, సర్వేయర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

జిరాయితీ భూమి ప్రభుత్వ చెరువుల్లోకి రికార్డులు మారాయి..

రేగిడి: మండలంలోని సోమరాజుపేట గ్రామానికి చెందిన బూడి ఆదినారాయణ జిరాయితీ భూమి ప్రభుత్వ చెరువుగా రికార్డులు మారాయని వాటిని తక్షణమే మార్పే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఎం చిన్నారావుకు అర్జీ ద్వారా మొరపెట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం సోమరాజుపేట, అంబకండి గ్రామంలో ఆయా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామపంచాయతీల్లో 13 మంది రైతులు భూ సమస్యలపై అర్జీలు చేసుకున్నారు. సోమరాజుపేటలో కన్నం వెంకటరావు, సుంకరి సూర్యనారాయణ, సీతమ్మ నాయుడుకు సంబంధించిన జిరాయితీ భూములు జీరో విస్తర్ణం చూపిస్తున్నాయని అవి తక్షణమే మార్పి న్యాయం చేయాలని అర్జీలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రేవతి, విఆర్‌ఒలు హరిత రాజీ, నాగరాజు, రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ దాట్ల కీర్తి

మ్యుటేషన్లకే అధికం

వేపాడ : మండలంలోని దబ్బిరాజుపేట, కరకవలసలో తహశీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మ్యుటేషన్లకే అధికంగా అర్జీలు వచ్చాయి. దబ్బిరాజుపేటలో 17, కరకవలసలో 10 అర్జీలు అందాయి. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంఆర్‌ఐ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

45 రోజుల్లో పరిష్కారం

శృంగవరపుకోట : రెవెన్యూ సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. సోమవారం మండలంలోని చామలాపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వంలో భూముల అక్రమాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సభల ద్వారా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు పాల్గొన్నారు.



రేగిడి: వినతులు స్వీకరిస్తున్న అధికారులు, నాయకులు

విజయనగరం టౌన్ : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. నగరంలోని తోటపాలెం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో కమిషనర్‌తో పాటు తహశీల్దార్ కూర్మనాథ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సదస్సు వద్ద ఏర్పాటు చేసిన అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను అంతకుముందు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలనుంచి వస్తున్న వినతుల్లో ఎక్కువ భాగం భూ సమస్యలేనని చెప్పారు. ప్రతీఒక్కరూ తమ భూముల రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 94 వినతులు

ప్రజాశక్తి–విజయనగరంకోట

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 94 వినతులు వచ్చాయి. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 94 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 43 వినతులు వచ్చాయి. అనంతరం అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, ఇంకా చూడనివి సైట్ లో ఉండకూడదని, వచ్చే సోమవారం నాటికి ఏ శాఖ వద్ద పెండింగ్ వినతులు ఉండకూడదని తెలిపారు. గంట గంటకూ పిజిఆర్ఎస్ పెండింగ్ వివరాలను మోనిటర్ చేయాలని డిఆర్‌ఒకు కలెక్టర్ ఆదేశించారు. హై కోర్ట్, జిల్లా కోర్ట్ లలో ఫైల్ అయిన కేసులను కోర్ట్ వెబ్‌సైటు లో ప్రతి రోజు తనిఖీ చేయాలనీ కలెక్టర్ తెలిపారు. రెవిన్యూ సదస్సులలో సేవల కోసం అందిన దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు సాయంత్రానికి ఎన్ని దరఖాస్తులు అందాయి , ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారో నివేదిక నివ్వాలని సూచించారు.

రెవిన్యూ సమస్యలపై సదస్సులోనే వినతులు

రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలు రెవిన్యూ సదస్సుల్లోనే తమ వినతులను సమర్పించాలని, కలెక్టరేట్ వినతుల విభాగానికి రానవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఒక ప్రకటన లో తెలిపారు. రెవిన్యూ సదస్సుల్లో వినతులను గ్రామ సభల్లోనే చదివి అక్కడికక్కడే పరిష్కరిస్తామని, వాస్తవ పరిస్థితుల్ని వివరించి ప్రజల ముందే సమాధానం చెబుతామని తెలిపారు.

మా స్థలాలను కాపాడండి

జామి మండల కేంద్రంలోని ఎల్లారమ్మ గుడి దగ్గర ఎస్‌టి (ఎరుకల) కాలనీలో నివాసం ఉంటున్న తమ స్థలాలను కాపాడాలని బాధితులంతా అధికారులకు వినతినిచ్చారు. తమకు 2001 జన్మభూమి కార్యక్రమంలో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందన్నారు. తమకు ఇచ్చిన స్థలంలో 30 అడుగులు మినహాయించుకుని, తాము వరుసగా ఇళ్ల కట్టుకుని మిగిల్చికున్న స్థలంలో తట్టలు ,బుట్టలు అల్లుకుని జీవనం సాగిస్తున్నా మన్నారు. ఇప్పుడు ఉప సర్పంచ్ తమను ఇబ్బంది పెడుతున్నారని, దీనిపై సర్వే చేసి మా స్థలం మాకు ఇప్పించాలని కోరారు.



వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి–విజయనగరకోట

ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో తక్షణం చర్యలు చేపట్టాలని ఎస్‌పి వకుల్ జిందాల్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం వినతులు స్వీకరించారు. ఈవారం 27 మంది తమ సమస్యలపై వినతులు ఇచ్చారు. అనంతరం పోలీసు అధికారులతో ఎస్‌పి మాట్లాడుతూ ఫిర్యాదు దారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎవి లీలారావు, ఆర్‌వి ఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి అధికారులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతినిస్తున్న రిక్కి అప్పారావు

సమస్యలపై వినతి

ప్రజాశక్తి–వేపాడ

బక్కునాయుడుపేట వద్దనున్న సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో సమస్యలను పరిష్కరించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. గ్రీవెన్స్‌లో ఎంపిడిఒ సూర్యనారాయణకు సోమవారం వినతి అందించారు. గురుకుల ఆవరణలో ఉన్న ముళ్లపొదలను తొలగించాలని కోరారు. ఎంపిడిఒ స్పందిస్తూ నిధుల కోసం కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తెలిపారు.

విద్యా వ్యవస్థ నాశనం

ప్రజాశక్తి–చీపురుపల్లి

కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని వైసిపి మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు విమర్శించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మెగా పేరెంట్స్ మీటింగ్ అని చెప్పి పది రోజుల పాటు విద్యార్థులను చదువుకు దూరం చేశారన్నారు. ముమ్మరంగా పనులు సాగుతున్న కాలంలో సమావేశాలకు తల్లిదండ్రులను తీసుకురావాలని విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తుతో సిఎం చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేష్ ఆటలాడుకుంటున్నారని దుయ్యబట్టారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉంటున్నా ఎమ్మెల్యే కళావెంకటరావు గానీ, అధికార పక్ష నాయకులు గానీ స్పందించక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వానికి పాఠశాలలపై పర్యవేక్షణ చేతకాదంటే, ప్రతిపక్షంలో ఉన్న తాము ఆ బాధ్యత తీసుకొని విద్యారుక్థలకు అండగా ఉంటామని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు పతివాడ రాజారావు, బాణాన శ్రీనివాసరావు, చందక గురునాయుడు పాల్గొన్నారు.

డిజిటల్ పేమెంట్‌ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి–బొబ్బిలి

రైలు టికెట్లకు డిజిటల్ పేమెంట్ నిర్ణయాన్ని రద్దు చేయాలని బొబ్బిలి రైల్వేస్టేషన్ వద్ద సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్టేషన్ సిసి చంద్రగౌడ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు మాట్లాడుతూ సాధారణ, రిజర్వేషన్ టికెట్లకు డిజిటల్ పేమెంట్ ద్వారానే టికెట్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చదువు లేని ప్రజలు, ఫోన్లు వినియోగించని వారు వేలాదిమంది రోజు రైళ్లలో ప్రయాణిస్తున్నారని తెలిపారు. వీరు డిజిటల్ పేమెంట్ ద్వారా ఎలా టికెట్లు తీసుకోగలరని ప్రశ్నించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైల్వేలో వివిధ విభాగాలను, అందులో రైల్వే బుకింగ్ కౌంటర్లను ప్రయివేటీకరణ చేయాలనే దుర్బుద్ధితో ఇటువంటి ఆదేశాలను ఇస్తోందని విమర్శించారు. ఈ దుర్మార్గమైన విధానాలను ప్రజలంతా ఖండించాలని కోరేరు. ఈ కార్యక్రమంలో సిపిఎం రామభద్రపురం మండల కన్వీనర్ బలస శ్రీను, పట్టణ కమిటీ సభ్యులు బి.యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

28 లక్షల మందికి కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి–భోగాపురం

వికాస్ తరంగిణి ట్రస్ట్ ద్వారా దేశంలోని 28 లక్షల మంది మహిళలకు కేన్సర్ పరీక్షలు నిర్వహించినట్లు చినజీయర్ స్వామి తెలిపారు. మండలంలోని మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో కాకర్లపూడి శ్రీనివాసరాజు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాస్ తరంగిణి వాలంటీర్ల ద్వారా ఎన్నో విపత్తుల్లో సేవలందించామన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని, అప్పుడే సమాజానికి మీ సేవలు ఉపయోగ పడతాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ వాలంటీర్లకు శిక్షణ ఇస్తే నియోజకవర్గంలోని మహిళలకు కేన్సర్‌పై అవగాహనతోపాటు పరీక్షలు కూడా నిర్వహించేలా చూస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ చల్లా త్రినాథరావు రచించిన 'ద ఆర్ట్ ఆఫ్ స్ట్రెస్ రిలీఫ్ ఏషియన్షియల్ టిప్స్ ఫర్ ఎగ్జామ్ ప్రెజర్' అనే పుస్తకాన్ని చినజియర్ స్వామి, ఎమ్మెల్యే నాగమాధవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వికాస్ తరంగిణి రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.ఆర్ వర్మ, కేంద్ర కమిటీ సభ్యులు టి.వి.రమణమూర్తి, ప్రిన్సిపల్ అర్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, చినజీయర్ స్వామి

విద్యార్థుల సమస్యలపై పోరాటాలు

నగర మహాసభలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్

ప్రజాశక్తి–విజయనగరం టౌన్

ఎస్ఎఫ్ఐ విజయనగరం నగర మహాసభలు సోమవారం ఘనంగా జరిగాయి. మహాసభకు ముఖ్య వక్తగా విచ్చేసిన జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ నగరంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం చేసే ఏకైక విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. ప్రభుత్వం మారినా విద్యా రంగ సమస్యలు పరిష్కారం మాత్రం కావటం లేదని విమర్శించారు. నగరంలో 5 ఏళ్ల క్రితం ఏర్పడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటికీ సొంత భవనం లేదన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల , సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వం విద్యార్థులకు 3650 కోట్ల బాకీ ఉంటే ఈ ప్రభుత్వం కూడా తానేమి తక్కువ తినలేదు అన్నట్టు అదే స్థాయిలో పెండింగ్ పెట్టిందని విమర్శించారు. సంక్షేమ హాస్టల్స్ పరిస్థితి చూస్తేనే భయమేస్తుందన్నారు. మహాసభల స్ఫూర్తితో విద్యా రంగ సమస్యల పరిష్కారం దిశగా నూతన కమిటీ పని చేయాలని కోరారు. మహాసభల ఆమోదంతో 18 మందితో నూతన పట్టణ కమిటీ ఎన్నికైనది. కార్యదర్శిగా కె.రాజు, అధ్యక్షుడిగా జి.సూరిబాబు ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన రూరల్ మహాసభ ఆమోదంతో 9 మందితో నూతన రూరల్ కమిటీ ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా జి.రాహుల్, టి. వాసు ఎన్నికయ్యారు. మహాసభల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షులు డి.రాము, జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు,జె.రవికుమార్, ఎం.వెంకీ హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్

గ్రామాభివృద్ధిపై డాక్యుమెంటరీ

ప్రజాశక్తి – పూసపాటిరేగ

మండల సమైక్యా, విఒ, ఎస్‌హెచ్‌జి కలసి గ్రామాభివృద్ధిపై ఒక డాక్యుమెంటరీ తయారీ చేసే విదంగా శిక్షణ ఇస్తున్నట్లు ఏరియా కోఆర్డినేటర్ ఎస్.రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు శిక్షణా కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీ కళ్యాణచక్రవర్తి ఆదేశాలు ప్రకారం కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎన్ఆర్‌సిఎమ్ స్కీమ్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి ఇద్దరు చొప్పున సభ్యులను ఎంపిక చేసి వారికి రెండు రోజులు పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. వారు వెళ్లి గ్రామంలో మిగతా సభ్యులకు శిక్షణ ఇస్తారన్నారు. మండల సమైక ఆధ్వర్యంలో ఒక విజనరీ డాక్యమెంటరీ తయారీ చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో జరిగే అభివృద్ధిపై ఎపిపి, బిడిపి ప్రణాళికలు తయారు చేస్తారన్నారు. శిక్షణలో రిసోర్స పర్సన్స్‌గా ఎస్. అరుణ, ఎపిఎం ఎల్‌సి విశ్వేశ్వరావు, ఎపిఎం అచ్చుత్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రాజ్‌కుమార్

ఉపాధిపై దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి– గరివిడి

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు. టిడిపి యువనేత, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. స్థానిక కెఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఈ మేళాను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ 950 మందికి పైగా యువతీ యువకులు ఈ మేళాను వినియోగించుకున్నారన్నారు. రామ్ మల్లిక్ నాయుడు పలుమార్లు పలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కోసం ఈ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. అరబిందో, హెట్రో, యోకోమ, సినర్జిస్ ప్రముఖ కంపెనీలు ప్రతినిధులు మెగా జాబ్ మేళాను నిర్వహించారని చెప్పారు. సుమారు 350 మంది ఉద్యోగావకాశాలు దక్కించుకున్నారని ఇది మొదలు మాత్రమేనని ఇకపై మరిన్ని జాబ్ మేళాలు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టియన్ఎస్‌యఫ్ తెలుగు యువత నాయకులు, నాలుగు మండలాలకు నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి– నెల్లిమర్ల

స్థానిక డైట్ కాలనీలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల గోడ వెనుక బహిరంగ ప్రదేశంలో సోమవారం గంజాయి తాగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ డి. గణేష్ తెలిపారు. గురుకుల పాఠశాల వద్ద తుప్పలలో కొంత మంది వ్యక్తులు గంజాయి తాగుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు రైడ్ చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.